యంత్రసేవ.. కనిపించని తోవ

- వ్యవసాయ యంత్ర పరికరాలు కలేనా?
- స్ప్రేయర్లు, పట్టల కోసం ఎదురుచూపు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

ఏర్పేడు: ''ఆరుగాలం శ్రమించిన రైతన్నకు అన్నీ అనుకూలించి నాలుగు ధాన్యపు గింజలు ఎక్కువ పండిస్తేనే కాస్తో, కూస్తో మిగులుబాటు అయ్యేది. ఓ వైపు ప్రకృతి వైపరీత్యాలు వెంటాడినా, పంట చేతికొచ్చాక గిట్టుబాటు ధరలేక అన్నదాత నగుబాటుకు గురై అప్పులు ఊబిలో కూరుకుపోతున్నాడు. పెట్టుబడి ఖర్చులో కొంతైనా తగ్గించేందుకు గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ యంత్ర పనిముట్లు పంపిణీ చేసి ఆదుకుంది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ దిశగా కనీసం యోచన చేయకపోవడం అన్నదాతపై వారికున్న సవతితల్లి ప్రేమకు తార్కాణం.'' ఖరీఫ్ పంట కాలం ముగుస్తున్నా రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీపై కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది.

ప్రస్తుతం రబీ సాగుకు నియోజకవర్గంలో రైతాంగం సన్నద్ధమవుతున్నారు. ట్రాక్టర్లు, కట్టర్లు, పవర్ స్ప్రేయర్లు, మినీ టిల్లర్లు, టార్పాలిన్ పట్టలను గతంలో రైతులకు సబ్సిడీపై రైతు భరోసా కేంద్రాలలో ఇచ్చేవారు. కూలీల కొరత నేపథ్యంలో సంప్రదాయ వ్యవసాయ పద్ధతి కష్టతరమైన పరిస్థితుల వల్ల వ్యవసాయ యాంత్రీకరణ తప్పనిసరి అయింది. రైతులకు ట్రాక్టర్లు బ్యాంకర్ల సహాయంతో సబ్సిడీపై అందించేవారు. మందుల పిచికారీకి ఉపయోగించే పవర్ స్ప్రేయర్లు బహిరంగ మార్కెట్‌లో రూ.25 వేల వరకు ఉండగా, వ్యవసాయ శాఖ రైతులకు సబ్సిడీపై రూ.10 వేలకే అందించేవారు. దీనికితోడు వరి కోత యంత్రాలు, పవర్ టిల్లర్లు, ఆయిల్ ఇంజన్లు, కల్టివేటర్లు, రోటోవేటర్లు వంటి వ్యవసాయ యంత్ర సామగ్రి కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.


మండలంలో సాగు చేసిన వరి


ఏర్పేడు రైతు సేవా కేంద్రం

వివరాల నమోదుతో సరిపెట్టి

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన ఎఫ్ఎం(ఫాం మెకనైజేషన్) యాప్‌లో గ్రామాల్లోని రైతుల వద్ద ఏ వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉన్నాయి. ఇంకా ఏ పనిముట్లు అవసరం, ఉన్న వాటిలో ప్రభుత్వ రాయితీతో రైతులకు అందజేశారా..?, వారే ప్రైవేటు మార్కెట్‌లో సొంతంగా కొనుగోలు చేశారా..? అనే వివరాలను గ్రామాల వారీగా ఆయా రైతు సేవా కేంద్రాలలోని సచివాలయ వ్యవసాయ సహాయకులు నమోదు చేస్తున్నారు. అయితే రైతులకు సబ్సిడీపై పరికరాలు ఎప్పుడిస్తారనేది మాత్రం ఉన్నతాధికారుల నుంచి స్పష్టత లేదని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న రైతులకు తిప్పి పంపుతున్నారు.

వ్యవసాయ పరికరాలు అందించాలి



మండలంలో ముఖ్యంగా పవర్ స్ప్రేయర్లు అవసరం ఉంది. పురుగు మందుల పిచికారికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. రోటోవేటర్లు, కల్టివేటర్లు, టార్పాలిన్ పట్టలు వంటి వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై అందించటానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
–పి.మల్లయ్య, రైతు, నచ్చనేరి, ఏర్పేడు మండలం

బడ్జెట్ కేటాయించలేదు:

రైతులకు సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు పంపిణీకి సంబంధించి బడ్జెట్ కేటాయింపులు జరగలేదు. కేటాయింపులు జరిగి, ఉన్నతాధికారుల నుంచి మార్గదర్శకాలు వస్తే రైతులకు కావాల్సిన పరికరాలు అందజేస్తాం.
–సాగరిక, మండల వ్యవసాయాధికారి, ఏర్పేడు

క్లుప్తంగా

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు


విజేతలతో గుడ్లూరు ఐశ్వర్య

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎంజీఎం కళాశాలలో బుధవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీ చదువుతున్న లిఖిత ప్రథమ బహుమతి సాధించగా, సెకండ్ ఇయర్ బైపీసీకి చెందిన ధనుశ్రీ రెండో స్థానం, జూనియర్ ఎంఈసీ విద్యార్థిని మీనాక్షి మూడో స్థానం సాధించారు. విజేతలకు ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ గుడ్లూరు ఐశ్వర్య బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపల్ వీఎస్ రత్నం పాల్గొన్నారు.

ఘనంగా సమాధి దినోత్సవం


అన్నదానం చేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని కొత్తపేటలో బుధవారం షిరిడీసాయి సేవా సమితి ఆధ్వర్యంలో షిరిడీ సాయిబాబా సమాధి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా బాబా చిత్రపటానికి పూజలు చేసి, అనంతరం భజన కార్యక్రమం చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. జగదీష్‌రెడ్డి, మునస్వామి, రాముగుప్తా, రాజా, జయకుమార్, సునీల్ రమణ కవి, గరికపాటి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అరణియార్ గేట్ల ట్రయల్ రన్


అరణియార్ గేట్లు ట్రయల్ రన్ పరిశీలిస్తున్న అధికారులు


నాగలాపురం: అరణియార్ జలాశయ స్పిల్‌వే గేట్లు ట్రయల్‌రన్‌ను బుధవారం నిర్వహించారు. నీటి పారుదల శాఖ ఎస్ఈ వెంకటేశ్వర రాజు, ఈఈ వెంకట శివారెడ్డి పరిశీలించారు. ప్రాజెక్టు వివరాలను డీఈ శ్రీనివాసులు, ఏఈ ధరణి కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. జలాశయంలో నీటి మట్టం 26 అడుగులకు చేరువైంది. అలాగే ప్రస్తుత సీజన్‌లో పూర్తి స్థాయి నీటి మట్టానికి జలాశయం చేరుకునే అవకాశాలు మెండుగా ఉండడంతో గేట్ల పనితీరును వారు పరిశీలించారు. కొన్ని నిమిషాలపాటు నాలుగు గేట్లను పైకెత్తి ట్రయల్‌రన్ చేశారు. వాటి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గేట్లను మూసివేశారు. జలాశయ నీటి మట్టం 30 అడుగులకు చేరే సమయంలో కొద్ది కొద్దిగా నీటిని దిగువకు విడుదల చేసి నీటి మట్టం స్థిరంగా ఉండేలా పర్యవేక్షించాలని స్థానిక ఇంజినీర్లకు ఎస్ఈ ఆదేశించారు.

శ్రద్ధాంజలి


నివాళులు అర్పిస్తున్న నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు పంచాయతీకి చెందిన నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మహేంద్ర తండ్రి వాసు ఇటీవల కన్నుమూశారు. చిన్న పాండూరు సమీపంలోని వడ్డిపాళెంలో బుధవారం దశదిన కర్మక్రియ కార్యక్రమానికి సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ హాజరయ్యారు. వాసు చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. మహేంద్ర కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన వెంట ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, సీనియర్ నాయకులు చిలమత్తూరు భాస్కర్ రెడ్డి, అనుబంధ విభాగాల నియోజకవర్గ అధ్యక్షులు బందిల సురేష్ (బూత్ కమిటీ), దుడ్డు వేణు (ఎస్సీ సెల్), శివా యాదవ్ (ప్రచార విభాగం), రాష్ట్ర యువత కార్యవర్గ సభ్యులు శిబి చక్రవర్తి, మండల కార్యదర్శి మాధవయ్య, జిల్లా సోషల్ మీడియా కార్యదర్శి శోభన్ యాదవ్, సర్పంచులు అలీ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా నూతన కమిటీ


ఎస్.జయచంద్ర, టి.సుబ్రమణ్యం, ఈఎస్.కుమార్

తిరుపతి కల్చరల్: సీఐటీయూ జిల్లా నూతన కమిటీని ఎంపిక చేసినట్లు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడిగా ఎస్.జయచంద్ర, ప్రధాన కార్యదర్శిగా టి.సుబ్రమణ్యం, కోశాధికారిగా ఈఎస్.కుమార్, ఉపాధ్యక్షులుగా కందారపు మురళి, జి.బాలసుబ్రమణ్యం, వి.నాగరాజు, కేఎస్ ప్రసాద్‌రావు, పి.రామకృష్ణ, ఎస్.వాణిశ్రీ, చెంగయ్య, వేణుగోపాల్, కార్యదర్శులుగా ఆర్.లక్ష్మి, ఆర్.వెంకటేష్, గురవయ్య, నాగ వెంకటేష్, పి.బుజ్జి, లక్ష్మయ్య, రాజేశ్వరితో పాటు మరో 58 మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.

ఎఫ్ఏ-2 పరీక్ష కేంద్రం తనిఖీ


పరీక్షలను పరిశీలిస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభమైన ఎఫ్ఏ–2 పరీక్షల కేంద్రాలను బుధవారం ఎంఈఓ–2 మునిసుబ్రమణ్యం పరిశీలించారు. బుచ్చినాయుడుకండ్రిగ, నీర్పాకోట, కనమనంబేడు పాఠశాలలను ఆయన సందర్శించారు. ఇప్పటికే ఎఫ్.ఏ–1 పరీక్షలు పూరయ్యాయని, ఎఫ్ఏ పరీక్షలలో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థుల సామర్థ్యాలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రమణయ్య పాల్గొన్నారు.

ప్రేక్షకులు మెచ్చే సినిమాలే లక్ష్యం

తిరుపతి కల్చరల్: తెలుగు ప్రేక్షకుల అభిరుచులు, భావోద్వేకాలు ప్రతిబింబించేలా ప్రేక్షకులను ఆకట్టుకునేలా సినిమాలు తీయాలని లక్ష్యంగా పెట్టుకున్నానని యువ సినిమా హీరో కిరణ్ అబ్బవరం తెలిపారు. బుధవారం సాయంత్రం ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తనను ప్రేక్షకులు ఎంతో ఆదరిస్తున్నారని, వారి ఆకాంక్షలకు తగ్గట్టు కుటుంబ సమేతంగా చూడదగిన సినిమాలను తీసి, వారి నుంచి మరింత మెప్పును పొందేందుకు ప్రయత్నిస్తానన్నారు. ప్రతి ఒక్కరికీ నచ్చేలా రూపొందించిన చిత్రం కే–ర్యాంప్ చిత్రం ఈనెల 18వ తేదీన విడుదల కానుందని తెలిపారు.

పెద్దిరెడ్డిని కలిసిన మండల నేతలు


పెద్దిరెడ్డిని కలిసిన వైఎస్సార్ సీపీ నాగలాపురం మండల నేతలు

నాగలాపురం: మండలంలోని కారణికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జేబీఆర్ స్కూల్ చైర్మన్ జేబీ.మునిరత్నం ఇటీవల రాష్ట్ర వైఎస్సార్ సీపీ టీయూసీ కార్యదర్శిగా నియమితులైన నేపథ్యంలో బుధవారం ఆయన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని పెద్దిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జగదీష్ రెడ్డి, పల్లికొండేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ ఏవీఎం బాలాజి రెడ్డి, బుజ్జి రెడ్డి, ఎంపీపీ శ్యామ్, జెడ్పీటీసీ సభ్యుడు మహేష్ రెడ్డి, యువ నాయకుడు తేజ పాల్గొన్నారు.

సలహా కమిటీ లీడర్లకు శిక్షణ


మాట్లాడుతున్న నాగరాజు

శ్రీకాళహస్తి: రాష్ట్రీయ సేవా సమితి (రాస్) పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలోని రాస్ కార్యాలయంలో పొదుపు సంఘాల సలహా కమిటీ లీడర్లకు శిక్షణ కార్యక్రమం, ఆయుధ పూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లీడర్లు సేవా దృక్పథం, బాధ్యత, మంచి నైపుణ్యం, నాయకత్వం తదితర లక్షణాలు ఉండాలన్నారు. రాస్ ద్వారా సభ్యులకు ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాల ద్వారా వారి కుటుంబ అభివృద్ధికి దోహదపడుతాయన్నారు. అనంతరం ఆయుధపూజను నిర్వహించారు. క్లస్టర్ లీడర్లు జి వెంకటేష్, ప్రాజెక్ట్ ఆఫీసర్ కరుణాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల వితరణ


విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ సరస్వతి

వరదయ్యపాళెం: దివంగత రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బుధవారం చెన్నవారిపాళెం ప్రభుత్వ పాఠశాలలో 45 మంది విద్యార్థినీ విద్యార్థులకు బెటర్ ఎడ్యుకేషన్ ఫర్ పూర్ చిల్డ్రన్ ఫౌండేషన్ నిర్వాహకులు రియాజ్, అబ్దుల్లా నోటు పుస్తకాలను అందజేశారు. ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారిణి సరస్వతి మాట్లాడారు. కొన్నేళ్లుగా మండలంలోని పేద విద్యార్థుల కోసం బీఈపీసీ ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి విద్యార్థులకు వివరించారు. దాతల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సంస్థ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మునీశ్వరి, ఉపాధ్యాయులు శశికుమార్, రుషేంద్ర, సుజాత, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్


ఆలయం వద్ద ఏపీ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు చైర్మన్ పి.కృష్ణయ్య


ఎరువుల తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కృష్ణయ్య

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని బుధవారం ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి పి.కృష్ణయ్య కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా చేపడుతున్న ఆలయ పరిసరాల నుంచి వెలువడే వ్యర్థాలతో సేంద్రియ ఎరువులు తయారు చేసే యంత్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ బాపిరెడ్డి, డిప్యూటీ ఈఓ కృష్ణారెడ్డి, ఏఈఓలు మోహన్, విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.5లక్షల విలువైన టపాకాయలు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న టపాకాయలు

శ్రీకాళహస్తి: బాణసంచా అక్రమ విక్రయాలపై పోలీసులు కొరడా ఝుళిపించారు. శ్రీకాళహస్తి మండలం అరవ కొత్తూరు గ్రామం శివారులో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న టపాకాయల గోడౌన్‌పై డీఎస్పీ నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు నిఘా పెట్టారు. బుధవారం దాడులు చేసి రూ.5 లక్షల విలువైన టపాకాయలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో అనిల్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అనుమతులు లేకుండా టపాకాయలు నిల్వ ఉంచి, తక్కువ ధరలకు టపాకాయలు ఇస్తామని వాట్సప్ ద్వారా ప్రచారం చేస్తూ అమ్మకాలు సాగిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు నిఘా ఉంచి పట్టుకున్నారు. గోదాములు ఉన్న రూ.5 లక్షలు విలువైన టపాకాయలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ నరసింహమూర్తి మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా టపాకాయలు నిల్వ ఉంచి అమ్మకాలు జరిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా అనుమతులు లేకుండా బాణా సంచా విక్రయిస్తున్నట్లు ప్రజలకు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ నాగార్జున రెడ్డి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అరకొర వైద్యంతో అవస్థ


రేణిగుంటలో వైద్యం కోసం వేచి ఉన్న ప్రజలు

రేణిగుంట: పీహెచ్‌సీ వైద్యాధికారుల సమ్మె కారణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరైన వైద్యం అందక ప్రజలు అవస్థలు పడుతున్నారు. రేణిగుంట పట్టణంలోని పీహెచ్‌సీకి మండలంలోని నలుమూలల నుంచి వైద్యం కోసం రోజుకి 150 మంది నుంచి 200 మంది వరకు వస్తుంటారు. ప్రస్తుతం వైద్యాధికారులు సమ్మెలో ఉండడంతో రుయా హాస్పిటల్ నుంచి పీజీ డాక్టర్‌ని తాత్కాలికంగా కేటాయించారు. వైద్యం కోసం వచ్చే ప్రజలకు అరకొర వైద్యం చేయడంతో ప్రజలు ప్రైవేట్ వైద్యశాలలను ఆశ్రయిస్తూ జేబులకు చిల్లులు పెట్టుకోవాల్సి వస్తోంది. అందులోనూ 104 వాహనాలు గ్రామాల్లోకి వెళ్లకపోవడంతో మారుమూల గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారి అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డాక్టర్ల సమస్యలను పరిష్కరించి, పేద ప్రజలకు వైద్యాన్ని అందించాలని కోరుతున్నారు.

వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్లోబల్ హ్యాండ్‌వాషింగ్ డే కార్యక్రమానికి కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ భోజనానికి ముందు చేతులను శుభ్రం చేసుకోవాలనే అంశాన్ని అంగన్వాడీ పాఠశాలల్లో పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలని సూచించారు. అనంతరం చేతులను శుభ్రం చేసుకోవడానికి చెందిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సీసీక్యూసీ-2025లో డానియెలి కంపెనీకి పతకాలు


అవార్డు అందుకుంటున్న డానియెలి పరిశ్రమ ప్రతినిధి శ్రీనివాసరావు

వరదయ్యపాళెం: విశాఖపట్నం చాప్టర్‌లోని క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్ఐ) నిర్వహించిన 25వ చాప్టర్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్స్–2025 (సీసీక్యూసీ–2025)లో శ్రీసిటీలోని డానియెలి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ నాలుగు గోల్డ్, ఒక సిల్వర్ అవార్డులు సొంతం చేసుకుంది. అత్యున్నత నాణ్యతా పనితీరుకు గాను ఈ పతకాలు దక్కాయి. దీంతో పాటు విశిష్ట నాయకత్వ ప్రతిభకుగాను డానియెలి కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ)పి.శ్రీనివాసరావుకు ×ట్రాన్స్‌ఫర్మేషనల్ లీడర్‌షిప్ అవార్డు ప్రదానం చేశారు. ఆయన సామర్థ్యం, దార్శనికత, పటిష్ట నాయకత్వ లక్షణాలకుగాను ఈ అవార్డు వరించింది. ఇది శ్రీసిటీకి గర్వకారణం అని, డానియెలి యాజమాన్యం, సిబ్బందికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు తెలిపారు. అలాగే, అదానీ గంగవరం పోర్టుకు బంగారు, వెండి పతకాలు లభించాయి. ఆటోమేషన్‌లో ఈఎస్‌డీ–ఎంబీయూ బృందానికి బంగారు పతకం దక్కింది. కార్యాలయ భద్రత, వాతావరణ ప్రమాణాలపై ఈఎస్‌డీ యార్డ్ బృందానికి వెండి పతకం లభించింది. ఈ సందర్భంగా అదానీ గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ సీసీక్యూసీ–2025లో తమ సిబ్బంది సాధించిన విజయంపై సంతోషం వ్యక్తం చేశారు.

వంతెనల నిర్మాణం కలేనా?


అరుదూరు మార్గంలో వర్షానికి కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన వద్ద వాహనచోదకుల అవస్థలు, అదే మార్గంలో వాగులో వాహనాన్ని నెట్టుకువస్తున్న స్కూటరిస్టు (ఫైల్)

- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న స్థానికులు

వరదయ్యపాళెం: మండలంలోని అరుదూరు మార్గంలో వంతెనల ఏర్పాటు కలగా మారింది. వరదయ్యపాళెం నుంచి అరుదూరు మీదుగా కంచరపాళెం వరకు 4 కి.మీ. మేరకు పంచాయతీరాజ్ శాఖ రోడ్డు ఉంది. 2007లో అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఆ రోడ్డు బీటీ రోడ్డుగా మారింది. అయితే ఆ రోడ్డులో రెండు చోట్ల కరుణానదికి వెళ్లే రెండు ఉప కాలువలున్నాయి. ఆ ప్రాంతంలో వంతెనలు ఏర్పాటు చేయాల్సి ఉంది. రోడ్డు పనుల కోసం గతంలో మంజూరైన నిధుల్లో లోలెవల్ కాజ్‌వేల ఏర్పాటుకు మాత్రమే ప్రభుత్వం నిధులు కేటాయించింది. లోలెవల్ కాజ్‌వేలు నిర్మిస్తే వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం కలుగుతుందని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సంబంధిత పంచాయతీ ఇంజినీరింగ్ అధికారులు హైలెవల్ వంతెన కోసం కావాల్సిన నిధులకు సంబంధించి 13 ఏళ్ల క్రితం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. కానీ ఇప్పటివరకు ప్రభుత్వం పట్టించుకోలేదు. లోలెవల్ కాజ్‌వేలకు మంజూరైన నిధులు కూడా సమయం దాటిపోవడంతో వెనక్కి మళ్లాయి. రోడ్డు ఏర్పాటు చేసినప్పటికీ వంతెనల నిర్మాణం జరగకపోవడంతో సమస్య యథాతథంగా ఉంది.

వర్షాకాలం వస్తే చుట్టుకుని రావాలి

వర్షాకాలంలో అరుదూరు ప్రాంత ప్రజలు వరదయ్యపాళెం రావాలంటే చుట్టుకుని రావాల్సిందే. 3 కి.మీ. దూరంలో ఉన్న వరదయ్యపాళేనికి అటువైపుగా 8 కి.మీ. దూరం చుట్టుకుని రావాలి. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన


మండలంలోని కల్కి ట్రస్టు ద్వారా అరుదూరు మార్గంలోని ఒక కాలువ వద్ద 2016లో రూ. లక్షతో నిర్మించిన తాత్కాలిక వంతెన 2017లో కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. ఆ సమయంలో మరోమారు తాత్కాలిక వంతెనకు మరమ్మతులు చేపట్టి రాకపోకలను కొనసాగించారు. అయితే మూడేళ్ల క్రితం కురిసిన వర్షాలకు మరోమారు తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. దీంతో ఆ మార్గంలో వాహనచోదకులతోపాటు స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిధులు మంజూరు చేయాలి



అరుదూరు మార్గంలో వంతెనల ఏర్పాటుకు ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేయాలి. లేదంటే రానున్నది వర్షాకాలం కావడంతో మళ్లీ మా గ్రామస్తులకు కష్టాలు తప్పవు. రాకపోకలకు చాలా ఇబ్బందిపడాల్సి వస్తుంది.
–రామకష్టా రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు, అరుదూరు

మళ్లీ నిధులివ్వండి



అరుదూరు మార్గంలో లోలెవల్ కాజ్‌వేల నిర్మాణం కోసం మంజూరై వెనక్కి మళ్లిన నిధులను తిరిగి ప్రభుత్వం మంజూరు చేసి.. ఆ నిధులతో నూతనంగా వంతెనల నిర్మాణం కోసం ప్రభుత్వం చొరవ చూపాలి.
–శ్రీధర్ రెడ్డి, సర్పంచ్, అరుదూరు

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు


మాట్లాడుతున్న ఎంపీడీఓ రవిచంద్ర

రేణిగుంట: సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రవిచంద్ర సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీడీఓ రవిచంద్ర అధ్యక్షతన సీజనల్ వ్యాధులపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు తదితర వ్యాధుల రాకుండా సిబ్బంది సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. నీరు నిలవ ఉండే లోతట్టు ప్రాంతాలను గుర్తించి ముందస్తు ప్రణాళిక తయారు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ ప్రభురావు పాల్గొన్నారు.